# నానిగాడి ముద్దు

గొల్లపూడి రాజ్యలక్ష్మి

"జానకమ్మా! ఏం చేస్తున్నావ్? ఎప్పుడూ ఆ గదిలో మగ్గకపోతే ఇట్లా బైటకు రారాదూ!" చారుమతి అరుపులతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాను. అబ్బ!... ఎంతగొంతో? ఆ కంఠస్వరం భరించటం కష్టం. ముఖ్యంగా నిశ్శబ్దాన్ని ప్రేమించే వాళ్ళు!

"విన్నేనమ్మా తల్లీ! నిద్రపోతున్నావా ఏవిటి?" మళ్ళీ చారుమతి. తప్పదు. వెళ్ళకపోతే వదిలిపెట్టదు. నోట్లో వేలేసుకుని నిద్రపోతున్న నానిగాడి ప్రక్కన దిండుపెట్టి అయిష్టంగానే తలుపు తీసుకుని బయటకు వచ్చాను. చారుమతి అరుగుమీద విశ్రాంతిగా కూర్చుని – నా రాక కోసం ఎదురుచూస్తోంది. వేపచెట్టు నీడ మిట్టమధ్యాహ్నం ఎండ వేడికి చల్లదనాన్ని పులుముతోంది. అప్పుడే భోజనం చేసి వచ్చినట్లు వుంది చారుమతి వక్కపొడి నములుతోంది. భోంచేయగానే వచ్చి కాస్సేపు కబుర్ల పేరుతో లోకాభిరామాయణం పారాయణ చేస్తేగానీ ఆవిడకు తోచదు.

"ఏవిటి? అప్పుడే నిద్రయిపోయిందేమిటి?" అంది నవ్వుతూ.

"ఏదీ? ఇప్పుడే.. నానిగాడ్ని పడుకోబెట్టి.." అన్నాను. 'నువ్వు పడుకోనిస్తేగా?' అనాలని వున్నా – అనలేక ఎన్నోసార్లు ఎన్నోమాటలు అలా నాలో నేను అనుకోవడం, దిగమింగుకోవడం నాకలవాటే.

"ఏం నానిగాడో... నీది మరీ చాదస్తం. ఆక్రచ్‌లోనో – క్రైజ్‌లోనో విడిచి పొమ్మని నీ కొడుక్కి చెప్పొచ్చుగా. నీకీ వయసులో ఈ తంటాలన్నీ ఎందుకంటే వినిపించుకోవు. మోకాళ్ళు పట్టుకుపోయి అవస్థ పడుతూ కూడా ఇంకా ఈ బాధ్యతలన్నీ మీద వేసుకుంటావాయె!" అన్నది మందలింపుగా చారుమతి. రోజూ ఆవిడ అనేమాట అదే అయినా అలవాటుగా తీసుకోక ఎప్పటికప్పుడు అసహనంగానే తోస్తుంది.

"నా బాధ్యత వాడి మీద వున్నప్పుడు వాడివి నేను తీసుకోవటంలో తప్పేం వుంది?" అన్నాను.

"ఇంత పిచ్చిదానివి కనుకే – నిన్నిట్లా ఆడిస్తోంది నీ కోడలు!"

"ఇందులో పిచ్చితనం ఏముంది చారుమతీ?" అన్నాను విసుగ్గా. ఈ సంభాషణంతా నాకు పరమరోతగా అనిపిస్తుంది. చారుమతి మాట తీరే అంత. మాట కఠినం అయినా మనసు మంచిది. అందుకే తనని దూరంగా వుంచలేకపోతున్నాను.

"పిచ్చితనం కాక? నీ కొడుకుని నువ్వు కన్నావు, పెంచావు, ప్రయోజకుడ్ని చేశావు. అంతవరకే నీ బాధ్యత. ఆ తర్వాత నీ బాగోగులు నీ కొడుకు చూసుకోవటం లోకమర్యాద. అంతేగానీ.. నీ కొడుకు సంతానం గురించి నీకెందుకొచ్చిన లంపటం?" అంది దీర్ఘం తీస్తూ.

"లంపటం ఏముంది? నాని నాకేం పరాయివాడా? నా మనుమడేగా? ఎక్కడో ఆయాలపై వదిలితే అది మాత్రం నాకు సంతోషమా? అయినా నే మాత్రం చేసేదేముంది. ఇదొక కాలక్షేపం!" అన్నాను ఆ విషయం అంతటితో వదలమన్నట్టుగా.

"వాడి ముడ్డీ – మూతీ తుడవడం నీకంత ముచ్చటగా వుంటే నాదేం పోయింది. వాడితో నువ్వు పడే అవస్థలు చూడలేక అన్నాను గానీ.. అవునూ... ఈ చీర ఎక్కడదీ?" అన్నది నేను కట్టుకున్న చీరెని పట్టి పట్టిచూస్తూ.


"మొన్నామధ్య మా కోడలు తెచ్చింది!" అన్నాను. నిజానికి నా కొడుకే తెచ్చాడు. చారుమతితో కావాలనే అన్నాను.

"అవును మరి.. అవసరం! నిన్ను వ. ఖ్యమధ్య మంచి చేసుకోకపోతే – ఆ పిల్లకే నష్టం!"

"అబ్బా! చారుమతీ.. అన్నీ నువ్వలా ఆలోచిస్తావెందుకు? నా అవసరం వాళ్ళకి, వాళ్ళ అవసరం నాకు.సరేనా? ఇంకా గొడవ అపు" అన్నాను. కాస్త విసుగ్గా.

"నీ మంచి కోసం ఏం చెప్పబోయినా – అదేమిటో నీకు మహావిసుగు జానకమ్మా? సరేలే.. నాకెందుకొచ్చింది.. ఊ... ఏవిటి వంటకాలు?" అంది మాట మార్చి. ఇదే ప్రశ్న! ఎన్నో సంవత్సరాలుగా ఎందరో స్త్రీల నుంచి? ఇవాళేం వండావు? ఏం కూర? ఇదే ప్రశ్న తిరిగి తిరిగి రేయింబ






వళ్ళు ఎంత అనివార్యమో మనిషి జీవించి వున్నంత కాలం ఇదీ తప్పదేమో! కానీ.. ఆ ప్రశ్న వింటూనే నాలో ఏదో విముఖత. ఇదీ ఓ ప్రశ్నేనా? ఇద్దరు ఆడవాళ్ళు కలిస్తే మాట్లాడుకోవటానికి ఇంక మాటలే వుండవా? వంటిళ్ళలో మగ్గిమగ్గి బైటకొచ్చినా – ఇంకా ఆ ఛాయల్ని వదులుకోలేరా? అన్న ఆవేదన నాలో ప్రతిసారీ కలుగుతుంది. మళ్ళీ అంతలోనే 'మనిషి ప్రాథమిక అవసరమైన తిండి గురించి అడిగితే తప్పేంటి? ఆకలిగా వున్నప్పుడు నువ్వు మరోదేన్ని గురించైనా ఆలోచిస్తావా?' అన్న ఆలోచనా కలుగుతుంది. నాలోని ఈ ద్వంద్వ ప్రవృత్తి ఈ విషయంలోనే కాదు.

అనేక విషయాల్లో.. విమర్శ–సమర్థనా రెండూ కలుగుతాయి. పెదవి దాటని ఈ ఆలోచనా తరంగాల్లో నాలోనే విరిగి పడిపోతాయి. ఈ ఆలోచనల్లోపడి పరధ్యాసగా వుండే నేను కొందరి దృష్టిలో ముంగిగా వుంటాను. ఎవరోదాకా ఎందుకు ? నా కోడలి దృష్టిలో కూడా. "అబ్బో ... ఆవిడా? అట్లా ముంగిలా వుంటుంది గానీ.." అనడం అనేకసార్లు నా చెవిన పడకపోలేదు. చారుమతి నా సమాధానం కోసం ఎదురుచూడకుండా "ఇవాళ కంది పచ్చడిలోకి పచ్చి పులుసు చేశాను. గుమ్మడి వడియాలు వేయించి – అరటి దూటకూర ఆవపెట్టి వండాను. ఏవిటో...పాడు అలవాటు. పొమ్మన్నా పోదుగా. కమ్మటి కూర. అట్లా వేలితో అన్నా ముట్టలేదు నా కోడలు. ఆవ పెట్టారంటుంది. అది లేకపోతే కూరేమిటసలు? ఈ కాలపు వంటలన్నీ మసాలాల మయం. అవన్నీ నాకేం వచ్చి చచ్చు? ఏవిటో జానకమ్మా! మన తాపత్రయం తప్ప – ఈ వయసులో కూడా వంట చేసి పెడుతున్నందుకు కృతజ్ఞతన్నా లేదు వాళ్ళకి. అన్నట్టు నిన్న ఏం జరిగిందో తెలుసా?" అంటూ నా దగ్గరగా జరిగింది. చెప్పబోయే విషయానికి నాందిగా.

ఏం జరిగి వుంటుందో నాకు తెలుసు. ఆవిడ పెద్దరికానికి ఏదో అవమానం జరిగి వుంటుంది. ఇది మామూలే.

"మన అరుంధతి లేదూ? అదే శివయ్య తల్లి. యాత్రాస్పెషల్లో వెళ్తోందిట. 'నువ్వూ వస్తావా?' అని నన్నడిగింది. ముసలి ముండను. ఎప్పుడు గుటుక్కుమంటానో తెలీదు. ఈ పాపిష్టికళ్ళకు ఇన్నేళ్ళయ్యాయి ఓ దేముడా? ఓ పుణ్యతీర్థమా? ఈ జన్మకిదైనా మిగులుతుందని ఆశపడ్డాను. నా ముఖానికి అంత రాతకూడానా? నా కోడలు సరే. పైసా నాపై ఖర్చుపెట్టినా దండగే అంటుంది. కానీ.. నా కొడుకు కూడా.." గుడ్ల నీరు కుక్కుకుంటూ ఆగింది.

"ఏమన్నాడు?" అనడిగాను అప్రయత్నంగా.

"ఏమంటాడు? కాటికికాళ్ళు చాచుకున్నావు. ఎక్కడైనా 'హరీ'మంటే ఎవరు దిక్కు? ఆ కృష్ణా -- రామా అంటూ ముక్కు మూసుక్కూచోమన్నాడు" అంది చీదేస్తూ.

"నీ కొడుకు చెప్పిందే నిజమేగా చారుమతీ! వయసైపోయింది. ఊళ్ళు – గుళ్ళూ తిరిగే ఓపిక వుందా? ఏదైనా జరగరానిది జరుగుతుందేమో అని భయపడి వుంటాడు పాపం" అని నచ్చచెప్పబోయాను.

"ఔనౌను. భయమే.. భయం కాదు ప్రేమ. తల్లిమీద ప్రేమ. అంది వెటకారంగా.

కోపంతో వుండి అట్లా అంటున్నావుగానీ – నీ కొడుక్కి నీ మీద ప్రేమలేదంటావా? ప్రేమతోనే అన్నాడనుకోరాదూ?" అన్నాను నచ్చచెబుతూ.

"ఎట్లా అనుకోను? నిజంగా వాడికి ప్రేమే వుంటే నా మనసులోని కోరికను గ్రహించి నన్ను పంపేవాడుకాదూ? ఎందుకొచ్చిన ముసుగులు జానకమ్మా! ఏ ప్రేమలయినా – అపేక్షలయినా మనిషితో మనిషికున్నా అవసరాలకోసమే. అవి తీరాక ఎందుకూ పనికిరాని వాళ్ళమైపోతాం.ఈ అనుబంధాలన్నీ మనం ఆత్మవంచన చేసుకోవటానికి... అంతే!" అంటూ వేదాంత ధోరణిలో పడింది చారుమతి. చారుమతిలో నాకు నచ్చే గుణం ఇదే. ఏ విషయాన్నయినా నగ్నంగా చూపాలని ప్రయత్నిస్తుంది. ఒక విధంగా నాలోని అనేకానేక ఆలోచనకి కొత్త కోణాల్ని చూపిస్తుంది. మనిషి స్వభావాన్ని బట్టే విషయం రూపం దాల్చుతుంది. నిజమే! మనిషికి తాపత్రయం వుండాల్సిందే. కానీ ఎంత వరకు? జీవితాంతం వరకు అలా వెంపర్లాడాల్సిందేనా?

నా ఆలోచనల్లో నేను వుండగానే – నానిగాడు గుక్కపట్టి ఏడుస్తున్న సవ్వడి విన్పించింది. ఆదుర్దాగా లోపలికి పరిగెత్తాను. దిండు తోసేసి దొర్లి క్రింద పడ్డాడు. దెబ్బ తగిలినట్లుంది. వాడ్ని గుండెలకు చేర్చుకని సముదాయించసాగాను. వాడు ఓ పట్టాన ఏడుపు ఆపలేదు. బిస్కట్లు ఇచ్చి – పుస్తకంలోని బొమ్మల్ని చూపించి అమాయకంగా నవ్వే వాడి ముఖం చూశాక నా మనసు శాంతపడింది. ఆ కాస్త ఆరాటానికే నీరసం కమ్ముకొచ్చింది. విశ్రాంతి కోరుతున్న శరీరం – అదే దొరకని జీవనం అయిపోయింది. తెల్లవారు ఝామున లేచి దగ్గర్నుంచి పని.. పని.. ఎప్పుడైనా బద్ధకించి తొందరగా లేవకపోతే రవి ఆదుర్దాపడతాడు.

"ఏమ్మా? వంట్లో బాగాలేదా?" అంటూ నా మంచం చుట్టూ తిరుగుతాడు. వాడి ఆదుర్దా చూసి లేవక తప్పదు.

'అమ్మా! నువ్వున్నావు కనుక మాకిద్దరికీ నిశ్చింత. "అమ్మా! వంట నువ్వు చేస్తేనే తినాలి!' అంటూ కితాబులు. "అమలా నీకు తెలీదు వూరుకో అమ్మ చూస్తుంది" "అమ్మా! నానిగాడు నువ్వన్నం పెడ్తేనే బుద్ధిగా తింటాడు" "అమలా వాడ్నలా విసుక్కోకు. అమ్మ మాడు ఎంత ఓర్పుగా నచ్చచెప్తుందో.." అన్న రవి మాటలు చెవులకింపుగా వుంటాయి. ఇబ్బందిగానూ వుంటాయి. కాళ్ళచేతులు కట్టేసినట్టు.

తనపై వుంచిన గౌరవమా! నమ్మకమా! ఈ రెండూ కాక.....కాక మరో అర్థం వుందా?" అన్న మీమాంస.

నానిగాడు ఆటలో పడ్డాడు. చేతిలోని బొమ్మల్ని విసిరేస్తూ తెచ్చివ్వమంటున్నాడు. ఇదిగో వీడితో ఆడే సరికి – కాస్తో – కూస్తో మిగిలివున్న శక్తి ఆఖరు. కానీ వాడు నా మెడ చుట్టూ చేతులు వేసి 'నాన్నమ్మా' అంటూపెట్టే ముద్దు ముందు ఇవన్నీ లెక్క చేయాలనిపించదు.

మనవడితోనా ఆటలు తెమలవని గ్రహించిన చారుమతి 'వస్తా జానకమ్మా!" అంటూ బైట నుంచే తన మామూలు ధోరణిలో అరిచి వెళ్ళిపోయింది.

** ** **

"అమ్మా! బాత్‌రూం బాగా పాచి పట్టింది. రంగిచేత బాగా కడిగించ రాదూ?" అన్నాడు రవి ఆఫీసుకెళ్ళబోతూ.

"ఇవాళ కొత్తగా శుభ్రం గురించి గుర్తుచేస్తున్నావేమిటి విషయం? రెండ్రోజులకోసారి కడిగిస్తూనే వున్నాగా?"అన్నాను నవ్వి.

'అదేమిటి? నీకు తెలీదా? మన ప్రకాశం లేడూ వాళ్ళమ్మ గారు పాపం బాత్రూంలో కాలు జారి పడిపోయారు. కాలు ఫ్రాక్చర్ అయిందట. హాస్పటల్‌లో ఎడ్మిట్ చేశారు. అన్నట్టు ఆవిడ నీ ఫ్రెండ్ కూడా కదా?" అన్నడు రవి.

"ఎవరూ? చారుమతా? అయ్యో... పాపం విన్నకూడా మనింటికొచ్చి కూర్చుని వెళ్ళిందిరా?" అన్నాను ఆశ్చర్యంగా.

"ఏ రోజుకేమవుతుందో ఎవరికి తెలుస్తుందత్తయ్యా? మీరుకూడా జాగ్రత్తగా నడవండి. అసలే నాకు, మీ అబ్బాయికుక్కూడా లీవులులేవు." అన్నది నవ్వుతూనే అమల.

అమల మాటలకి నిశ్చేష్టురాలిన య్యాను. ' అంటే... అంటే.. వీళ్ళకి శలవలులేవు కనుక నేను పడకూడదా? ఈ వయసులో పడడం వల్ల వేరే అనర్థం ఏమీ లేదా? తనకు చేయాల్సి వస్తుందనేనా? ఏవిటా మాటలకర్థం?'

బైట మోటార్ బైక్ స్టార్ట్ చేయటం – నాని ఏడ్వటం 'తప్పనాన్నా! ఏడ్వకూడదు అదిగో నాన్నమ్మ! నీకు చాక్‌లెట్ ఇస్తుంది!' అంటూ అమల నచ్చచెప్పి నానిని లోపలికి పంపించి వాళ్ళు వెళ్ళిపోవడం తెలుస్తూనేవుంది.

"నాన్నమ్మా!" అంటూ నా కొంగు పట్టుకు లాగుతున్న నానిని ఎత్తుకుని సముదాయిస్తున్నా – నా ఆలోచనల్లో – ఈ అనుమాన శకలం బాధిస్తూనే వుంది. నాలుగురోజుల తర్వాత చారుమతి ఇంటికొచ్చాక పరామర్శించటానికి వెళ్ళాను.


నన్ను చూస్తూనే – "చూశావా జానకమ్మా! ఈ అవశిష్టం. ఏదో ఆ పనీ – ఈ పనీ చేస్తూ – హాయిగా తిరగనీయకుండా కాలు విరగ్గొట్టి మూలపడేశాడా దేముడు" అంటూ కళ్ళనీళ్ళు నింపుకుంది చారుమతి.

"వూరుకో చారుమతీ! ఇప్పుడేమైందనీ. ఇంకో నాలుగు రోజుల్లో నువ్వు లేచి తిరగవూ! ఇలాంటప్పుడే ధైర్యంగా వుండాలి" అన్నాను ధైర్యం చెప్తూ.

"ఏం తిరుగుతానో..." అని ఓ క్షణం ఆగి – "అన్నట్టు జానకమ్మా! నీకో విషయం చెప్పాలి సుమా. ఆ రోజు పడి నేను బాధతో అరుస్తుంటే పాపం నా కొడుకు ఎంత కంగారుపడిపోయాడో వెర్రి నాగన్న. పైకి అట్లా వుంటాడు గానీ, నేనంటే వెర్రి ఆపేక్షవాడికి. పాపం ఈ వారం అంతా శలవు పెట్టి నా దగ్గరే వున్నాడు. బాగా డీలాపడిపోయాడు సుమీ!" అని కాస్త గొంతు తగ్గించి – "ఏ మాటకామాటే చెప్పుకోవాలి. పాపం నా కోడలు సుగుణకూడా అసహ్యించుకోకుండా అన్నీ చేస్తోందమ్మా! నేను లేచి మళ్ళీ మామూలుగా తిరిగేదాకా ఆఫీసుకు శలవు పెడ్తానంది. ఏవిటో అనుకుంటాం గానీ జానకమ్మా! ఆపేక్షలన్నవి పొమ్మన్నా పోవమ్మా! రక్త సంబంధంలోనే వుంటాయి. పడితే పడ్డానుకానీ ఈ రూపంగానైనా నా వాళ్ళ అభిమానం తెలిసింది. అదే తృప్తి" అన్నది చారుమతి.

చారుమతి వంకే ఆశ్చర్యంగా చూస్తుండి పోయాను.

ఆ క్షణాన నాకు గుర్తొచ్చిందొక్కటే. ఏ కల్మషం లేని – అపురూపమైన అతిమధురమైన నానిగాడి ముద్దు.







# కేశవర్ధిని...
# పొడవయిన, ఒత్తయిన శిరోజాలకి తరతరాల రహస్యం

పోషణ నిచ్చే కేశవర్ధిని తలనూనె.
అందగత్తెలందరూ తమ ఆకర్షణీయమైన
శిరోజాల సౌందర్య రహస్యం తరతరాలకి అందచేశారు.

కొద్ది చుక్కల కేశవర్ధినిని ఒక చెంచాడు కొబ్బరినూనెలో కలిపి శిరోజాలకి రోజూ రెండుసార్లు బాగా రాస్తే అవి ఎంతో అందంగా, ఒత్తుగా, పొడవుగా, నల్లగా, నిగనిగలాడుతూ ఆరోగ్యంగా పెరుగుతాయి.

ఈ రోజునే కేశవర్ధిని కొనండి.

ఆరునెలలలోనే అందమైన శిరోజాలు పొందండి.



**కేశవర్ధిని**
తలనూనె

కేశవర్ధిని ప్రోడక్ట్స్ మద్రాసు-600 087